# ఇబ్బందే

''నావల్ల మీకేమయినా ఇబ్బందిగా ఉందా?'' అడగడం అచ్యుతంగారికి రివాజు.

కాస్త ఇబ్బందిగా కదిలి, చిరాకు కనిపించకుండా ప్రయత్నంచేస్తూ ''అబ్బే. అదేం లేదండీ'' - అనడం పరాంకుశానికి అలవాటు.

వారి మధ్య ఈ తతంగం చాలాసార్లు జరిగింది. ఒకేసారి మాత్రం-

''అలా చేస్తే పాపం, మీకు ట్రబులేమో'' అని అచ్యుతంగారు ఆవేళ అన్నప్పు మాత్రం-

''ఇబ్బందే...'' చప్పున అనేశాడు పరాంకుశం.

ధన్యవాదాలు చెప్పి వెళ్లిపోయేరు పరాంకుశంగారు.

* * *

''మీ ఇబ్బందిబాబాయి గారొస్తున్నారండోయ్'' చిలిపిగా నవ్వుతూ కేకేసి చెప్పింది జయ.

పరాంకుశానికి వొళ్లు మండుకొచ్చింది. ముసలాయన మీద పీకల వరకూ కోపం ముంచుకొచ్చింది. ఈయనింక నామానాన నన్ను బతకనిచ్చేలా లేడు' అనుకున్నాడు కోపంగా.

ఆ సమయంలో పరాంకుశం తీరిగ్గా, ఫ్రెష్‌గా కూచుని, ఏదో కథ రాయడానికి ఉపక్రమిస్తున్నాడు. వృత్తిరీత్యా పరాంకుశం బ్యాంకులో ఉద్యోగి. కొత్తగా పెళ్లయింది. చీకూచింతా లేని జీవితం. హాయిగా గడిచిపోతోంది. కథల్రాయడం ఓ హాబీ. లోగడ పత్రికల్లో కొన్ని కథలు పడ్డాయి కూడానూ.

బ్యాంకులో ఉద్యోగంతో ఎప్పుడోగాని కథలు రాసేమూడ్‌రాదు. మంచి మూడ్ వొచ్చినప్పుడు, తన ఆలోచనలని కాగితాల మీద పెట్టేసే శుభ తరుణంలో - సరిగ్గా అప్పుడు ప్రత్యక్షం అచ్యుతంగారు.

పైగా, వస్తూనే - ''ఏమోయ్ పరం... ఏదో దీక్షగా రాసుకుంటున్నట్టున్నావే.. నా రాకవల్ల నీకేమీ ఇబ్బంది కలగదు కదా?'' అంటూ ఓ పరామర్శ.

పరాంకుశానికా సమయంలో అతడిని చడామడా దులిపేద్దామనిపిస్తుంది. పీకలమొయ్యా కోపం ముంచుకొస్తుంది. కాని, చూస్తూ చూస్తూ పెద్దాయనని ఏమీ అనలేక, ఉక్రోషంతో లోలోనే ఉడుక్కుంటూ ''అబ్బే, అదేం లేదు. మామూలు రాతలే'' అంటూ నసిగేస్తాడు. ''అలాగయితే ఇబ్బందే లేదు. ఊఁ...చెప్పు, యివాళ పేపర్లో విశేషాలేమిటోయ్''? అంటూ సంభాషణకి ఉపక్రమిస్తూ కుర్చీలో సెటిలయిపోతారు.

పరాంకుశానికి [illegible] సోదియంతా చెప్పి [illegible] ఇలూ వ[illegible]తున్నప్పుడల్లా [illegible]. తన మనస్సులో [illegible]
మూడ్ అంతా పాడుచేసినందుకు పట్టరాని ఆగ్రహం వస్తుంది. ''నేను కొంచెం రాసుకోవాలండీ, మీరు తర్వాత రాకూడదూ...'' అని చెప్పెయ్యాలని మాట నోటి చివర వరకూ వస్తుంది.

''అబ్బే, ఏం లేదు, మామూలు రాతలే...'' అని యిందాకే నసిగేసేడు కనుక, యిక అలా చెప్పేసే ఛాన్సు అతనికుండదు.

అచ్యుతంగారు, ఇంటి భోగట్టాలనుండి ఇంటర్నేషనల్ విషయాల వరకూ ఊదర కొట్టేస్తారు.

మనసులో ఇబ్బందిని చేతులు నలుపుకోవడంలో ప్రదర్శిస్తూ ముళ్లమీద కూచున్నట్టుగా ఉంటాడు పరాంకుశం. అచ్యుతంగారదేం పట్టించుకోరు. తన ధోరణి తనదే. పరాంకుశం నర్మగర్భితంగా చేసే అభినయాలేం ఆయన అర్థం చేసుకోరు.

అలా వాళ్ల సంభాషణ చాలాసార్లు - జయ సప్లైచేసే టిఫిన్లతోనూ, కాఫీలతోనూ ఎప్పటికో కాని పూర్తి కాదు. ఆరోజుకింక పరాంకుశానికి రాతకోతలు బంద్. మళ్లీ రాసే మూడ్ ఎప్పటికొస్తుందో తెలీదు. వచ్చినా, ఆ రోజు కూడా ఈ పెద్దాయన తంచనుగా ప్రత్యక్షం కాబోడనే గ్యారంటీ ఏమీ లేదు.

పరాంకుశానికి గుండె గుభేలుమంది. అచ్యుతంగారు వస్తున్నారని జయ చెప్పడంతో అతని ఉత్సాహం నీరుకారిపోయింది. మనిషి పది లంఖణాలు చేసినవాడిలా డీలాపడిపోయేడు.

''రానీ చెప్తాను... ఈసారి ముఖం మీద నిర్మొహమాటంగా చెప్పేస్తాను'' గట్టిగా అనుకున్నాడు పరాంకుశం. తన కథ పెయ్యి నాకేసిందని అతని కర్థమైపోతూనే ఉంది. అందుకే వళ్లమండుకొస్తోంది.

ఏమయినా సరే, ఇవాళ తాడోపేడో తేల్చుకోవాలనే గట్టి నిర్ణయానికొచ్చేసేడు పరాంకుశం.

అచ్యుతంగారు లోనికి రానేవచ్చారు.

వస్తూనే ఎప్పటిలాగానే కుర్చీలాక్కుని కూచుంటూ, 'ఫోనొచ్చిందోయ్ నిన్న... శరభయ్యగారు చేశారు...'' అంటూ ఉపోద్ఘాతంలా ప్రారంభించి, ఏదో రాసుకుంటున్నట్టున్నావు.. నారాక వల్ల నీకు ఇబ్బందేమీ లేదు కదా?'' అని ఎప్పటిలాగే ముక్తాయించేరు.

శరభయ్య గారి నుంచి ఫోనంటే - అది తనకి సంబంధించిన ఓ ముఖ్య విషయం. అందువల్ల అచ్యుతంగారిని కడిగి పారేద్దామన్న ఆలోచన కరిగిపోయి, దానిస్థానంలో కుతూహలం చోటు చేసుకుంది పరాంకుశంలో.

''ఏం చెప్పారేమిటి?'' సౌమ్యంగా అడిగేడు.

''నామాట కాదనలేదు.. సర్టిఫికెట్లూ అవీ ఇచ్చి సుందరాన్ని వెంటనే పంపించమన్నారు. తన కంపెనీలోనే ఏదో ఉద్యోగంలో వేస్తానని భరోసాయిచ్చేరు - అందువల్ల మీ తమ్ముణ్ణి టెలిగ్రాం ఇచ్చి రప్పించి, వెంటనే మద్రాసు ప్రయాణం కట్టించమని'' చెప్పారు అచ్యుతంగారు.

పరాంకుశం సంతోషంతో పొంగిపోయేడు. అచ్యుతంగారివేపు ఆరాధనా పూర్వకంగా చూసేడు. అతని పట్ల తన అసంగతమయిన ఆలోచనా ధోరణికి తనలో తనని నిందించుకున్నాడు.

''మరింకనే వొస్తాను.. ఏవో రాసుకుంటున్నట్టున్నావు.. నీకు ఇబ్బందేమో...'' లేవబోయేరు అచ్యుతంగారు.

ఈసారి పరాంకుశం నిజంగానే నొచ్చుకున్నాడు. ''అదేం లేదు, కూచోండి. ఈ రాతలెప్పుడూ ఉండేవే. కడుపు నింపేనా, కాలు నింపేనా? మీరు చేసిన సహాయానికి ధన్యవాదాలు'' చేతులు జోడిస్తూ అన్నాడు పరాంకుశం.

అచ్యుతంగారు చిరునవ్వు నవ్వి మళ్లీ కుర్చీలో కూచున్నారు.

''ఇబ్బందయినా చెప్పలేవు.. నీదంతా అదో తరహా..'' అంటూ, చేతిలోకి పక్కనున్న పేపరందుకున్నారు.

* * *

అచ్యుతంగారు ఎప్పటిలాగే రోజూ వొచ్చి పోతూనే ఉన్నారు.

సుందరానికి ఉద్యోగం వేయించినందువల్ల పరాంకుశానికి అచ్యుతంగారి పట్ల మునపట్లా ఏమంత వ్యతిరేక భావం లేదు. ఇదివరకు ఆయనొచ్చి రోజూ తనమెదడు తినేస్తున్నాడని ఊరికే ఇదయిపోయేవాడు. పెద్దాయనకి పనీపాటా లేదని విసుక్కునేవాడు.

''పెద్దాయనకి పనీ పాటా ఉండి, రిటైరవక యింకా ఉద్యోగంలోనే ఉండుంటే, ఇలా వొచ్చి కబుర్లు చెప్పే తీరికే ఉండేది కాదేమో!'' నవ్వుతూ అనేది జయ.

''నీకేం, ఎన్నయినా చెబుతావు. ఆ సుత్తి భరించలేక, నా ప్రాణం కడతేర్చుకుని తోంది'' విసుక్కునేవాడు పరాంకుశం.

''నేను మాత్రం మీ ఇద్దరికీ కాఫీలూ అవీ అందించలేక సతమతం కావడంలేదా?'' కవ్విస్తున్నట్టుగా అనేదామె.

''అసలాయన రోజూ వాటి కోసమే వొస్తున్నట్టుంది. తేరగా వస్తుంటే ఎవరికయినా చేదా ఏమిటి?'' కోపంగా అనేవాడు పరాంకుశం.

''తప్పు. పెద్దాయన్ని అలా అనకండి. కళ్లుపోతాయ్''.

''హుఁ'' అని నిట్టూర్చేవాడు పరాంకుశం.

అచ్యుతం గారుండేది పరాంకుశం ఇంటికి దగ్గరలోనే. అసలు వాళ్లమధ్య రాకపోకలూ, స్నేహం ఏర్పడింది చాలా చిత్రమయిన పరిస్థితుల్లో...

* * *

ఆరోజు పరాంకుశం జీతం అందుకుని, బ్యాంకు నుంచి వొస్తూనే బెంబేలెత్తి పోయేడు. జీతం డబ్బంతా ఉంచిన పర్సు పోయింది! కంగారు పడిపోయేడు. చుట్టుపక్కల వాళ్ళు చేరి, ఆరాలు తీసేరు. ఆ సమయంలో పక్కింటి వాళ్లతో ఏదో పనుండి వచ్చిన అచ్యుతంగారు కూడా వాళ్లలో ఉన్నారు.

అసలేం జరిగిందో చెప్పమంటూ అడిగారు. అతనడిగిన వాటికల్లా ఓపిగ్గా జవాబులిచ్చేడు పరాంకుశం. స్కూటరు ట్రబులివ్వడంతో ఆ రోజు పరాంకుశం స్కూటరు తెయ్యలేదు. బస్సుమీదే బ్యాంకుకి వెళ్ళొచ్చేడు. జీతం అందుకున్నాక భద్రంగా డబ్బు పర్సులో దాచి జేబులో పెట్టుకున్నాడు.

''దారిలో ఎక్కడయినా ఆగేవా? గుర్తుకు తెచ్చుకుని చెప్పు''. పెద్దరికం వల్ల చనువుగా అడిగారాయన.

డబ్బుపోయిన చిరాకులో ఉన్న పరాంకుశానికి నషాళానికెక్కింది కోపం. 'పెద్ద పత్తేదారులా యీ ముసలాడి ఆరాలేమిట' ని లోలోపల విసుక్కున్నాడు. అచ్యుతంగారు వదలలేదు. ప్రతి చిన్న పాయింటునీ గుచ్చిగుచ్చి అడిగేరు విసుగ్గానే అయినా, చెప్పక తప్పలేదు పరాంకుశానికి.

పరాంకుశానికి ఎప్పుడయినా ఓసారి హుషారుగా కిళ్లీవేసుకుని, ఓ సిగరెట్ వెలిగించడం ఓ సరదా. ఆవేళ అదేచేసేడు.

''కిళ్లీ కొట్లో డబ్బులు పర్సులోంచి తీసిచ్చేవా, జేబులోంచా?'' అడిగేడు అచ్యుతంగారు.

''పర్సులోంచే జేబులో చిల్లరలేదు.'' విసుగ్గా చెప్పేడు పరాంకుశం.

'మరయితే తిరిగి పర్సు జేబులో ఉంచుకున్నావా? అక్కడే ఏ చాక్లెట్ల సీసామీదో పెట్టి మరిచిపోయేవా? గుర్తుచేసుకో''

పరాంకుశానికి గుర్తు రావడంలేదు. జుట్టు పీక్కున్నాడు. జయ విచారవదనంతో వాళ్ల సంభాషణ వింటూ ద్వారానికి ఆనుకుని నిలబడి ఉంది. పోయిన డబ్బు తిరిగొస్తుందన్న ఆశ ఆమెకీ లేదు.

''గుర్తు రావడంలేదు.. జేబులో పెట్టుకునే ఉంటాను..'' నసిగేడు పరాంకుశం.

అచ్యుతం గారు మరింక ఆలస్యం చెయ్యలేదు. పరాంకుశాన్ని వెంటబెట్టుకుని సేరుగా ఆ కిళ్లీకొట్టు దగ్గరకెళ్ళారు.

పర్సు గురించి ఆరా తీస్తే, ముందుకొంచెం తొట్రుపాటు పడినా తనకేం తెలీదనీ, అక్కడ పర్సేం లేదనీ అనేశాడు. ఆ తర్వాత ఎంత రెట్టించి అడిగినా వాడు తన మాటమీదే నిలబడిపోయేడు.

అచ్యుతంగారికి వాడెంచేతో అబద్ధం ఆడుతున్నట్టుగా తోచింది. బెదిరించేరు. వాడు బెదరలేదు. పైగా తిట్లకి లంకించుకున్నాడు.

ఇంతలో ఆ ఊరి సబ్ ఇన్స్పెక్టరు స్కూటరు మీద అటువేపు పోతూండడం చూసి 'ఓయ్ గవర్రాజూ.. మాట..'' అని కేకేసేరు అచ్యుతంగారు. ఆ ఇన్స్పెక్టరు అచ్యుతంగారికి బాగా తెలుసుట. దాంతో కొట్టువాడు బెంబేలెత్తిపోయి పర్సు యిచ్చేస్తూ అల్లరి చెయ్యొద్దని కన్నీళ్లతో వేడుకున్నాడు. గవర్రాజు స్కూటరు వెనక్కి తిప్పి వచ్చేడు. అచ్యుతంగారు అతనితో పర్సు సంగతేం చెప్పలేదు. ఆ మాటా ఈమాటా ఆడి పంపించేశారు. కొట్టువాడి కృతజ్ఞతకి అంతులేదు. పోయిందనుకున్న డబ్బు తిరిగి యిప్పించేక అచ్యుతంగారి పట్ల పరాంకుశానికి ఆరాధనాభావం పెరిగిపోయింది. ఆరోజు నుంచీ వాళ్లమధ్య స్నేహం పెరిగింది. వయోభేదం వారి సాంగత్యానికి అడ్డురాలేదు. రోజూ వొచ్చి పరాంకుశాన్నీ, జయనీ పలకరించి

వెళ్లందే అచ్యుతంగారికి తోచడంలేదు.

మామూలుగా అయితే ఆయన రాక పరాంకుశానికి విసుగు కలిగించదు. కాని, ఒక్కోసారి మాత్రం తను ఫ్రీగా, రిలాక్సింగ్‌గా ఉండడానికి వీలు చిక్కడంలేదని కోపం తెచ్చుకుంటూ ఉంటాడు.

ముఖ్యంగా ఏకథో రాసుకుందామనుకున్నప్పుడు మాత్రం ఆయన రాక పరాంకుశానికి విపరీతమయిన ఆగ్రహం తెప్పిస్తూ ఉంటుంది. ఆయన వెళ్లిపోయేక చిరాకుతో గింజులేస్తూ ఉంటాడు.

''పనీపాటూ లేకుండా వొచ్చి, తేరగా టిఫిన్లూ అవీ మేసి, పైగా 'మీకేమీ నారాకవల్ల ఇబ్బంది లేదు కదా?' అని సన్నాయి నొక్కులు కూడానూ'' అని కేకలేస్తూ ఉంటాడు.

జయ అతని మాటల్ని ఒప్పుకోదు. అచ్యుతంగారిపట్ల ఆ ఆలోచన ఉచితంగా ఉండదంటుంది.

''తప్పండీ - ఆయన భార్యాపిల్లలు లేనివారు. వొంటరివారు. ఉబుసుకపోక వచ్చి కబుర్లు చెప్పి వెళ్తారు. తిండికేవస్తారనుకుంటే ఎలా? ఆయనకేం లేదా, పోదా?'' అని దెబ్బలాడుతుంది.

''రోజూ ఆ నస, ఆ సుత్తి నేనింక భరించలేను.''

''ఓసారి బాగా ఆలోచించండి. అచ్యుతంగారివల్ల మనం చాలా ఉపకారాలు పొందేం. మీ సుందరానికి ఉద్యోగం వేయించేరు. పోయిన జీతం డబ్బులు చాకచక్యంగా రాబట్టి యిప్పించేరు. ఆ మధ్య నాకు సుస్తీ చేసినప్పుడు కన్నకూతుర్లా ఆదరించేరు. ఇలాంటివే చిన్నా చితకా సాయాలు చేయడమే కానీ మననుంచి ఎప్పుడయినా ఒక్క రూపాయి ఆశించారా?'' నచ్చ చెప్పడానికి ప్రయత్నించింది జయ.

''నిజమే. కాదనను, అచ్యుతంగారు నిజంగా పరోపకారి పాపన్నే! అయితేమట్టుకు రోజూ వచ్చి నా ప్రెషస్ టైమ్ ఇలా వేస్ట్ చేస్తూ ఉంటే మండదూ... అసలే కొత్తగా పెళ్లయిన వాణ్ణి''.

జయ మరేం అనలేదు.

* * *

చివరికి పరాంకుశం ఎంతవరకూ వెళ్లిపోయేడంటే - ఆ ఇల్లు మారిపోయి, అక్కడికి దూరంగా, అచ్యుతంగారి లాంటి వృద్ధులు నడవలేనంత దూరంలో ఓ యిల్లు అద్దెకి తీసుకుని, అందులోకి మారిపోయేవరకూ తన పంతం విడవలేదు.

జయ ఎన్ని విధాలుగానో నచ్చచెప్పింది. 'ప్రస్తుతానికి ఇల్లు మార్చేంత ఇబ్బందేం వొచ్చింద'ని గట్టిగా అడిగింది.

''ఇబ్బందా..., ఇబ్బందంతా ఆ పెద్దాయనతోనే'.

'' అదేం?''

''మరి నా సరదాలూ అవీ నాకుండవా - బ్యాంకునుంచి వొచ్చేక ఆ సాయంత్రాలూ, ఆదివారాలూ సెలవు రోజులూ అతనే నంజుకుంటూ ఉంటే.. నో.. యిల్లు మార్చాల్సిందే!''

''అన్యాయం! మీరు మరీ స్వార్థంగా, సంకుచితంగా మాట్లాడుతున్నారు'' నొచ్చుకుంది జయ.

''స్వార్థమే. ఆయన సహకారాలకి నా థాంక్స్ - కానీ, నాకంటూ నా చిన్న చిన్న సంతోషాలూ, సరదాలూ ఉండవా ఏం?''

ఇల్లు మార్చేసే రోజున - అచ్యుతంగారొచ్చేరు. కొంచెం దిగులుగా ముఖం పెట్టి, ''పోనీలే.. యింక రోజూ నావల్ల ఇబ్బంది తప్పుతుంది'' అన్నారు.

''అబ్బే, అదేం లేదు.. ఆ ఇల్లు కాస్త సదుపాయంగా ఉంటేనూ...'' నసిగేడు పరాంకుశం.

* * *

కొత్త ఇంట్లో కాపురం బాగానే ఉంది పరాంకుశానికి, మంచి హుషారుగా ఉన్నాడు. కావలసినంత తీరిక, ఏకాంతం. రోజూ బ్యాంకుకి వెళ్లినప్పుడూ, వొచ్చినప్పుడూ భార్యని వాటేసుకుని ముద్దులు కురిపిస్తున్నాడు. సెలవు రోజుల్లో భార్యతో సాయంత్రాలు షికార్లు చేస్తున్నాడు. ఇంట్లో ఉన్నంత సేపూ భార్యతో కబుర్లే కబుర్లు. ఎప్పుడేనా మూడ్ వచ్చినప్పుడు ఏ అంతరాయం లేకుండా కథలు రాసుకుంటున్నాడు. పరాంకుశం కోరుకున్నది ఇలాంటి జీవితాన్నే.

జయ మాత్రం - అప్పుడప్పుడు అచ్యుతంగారి గురించి గుర్తు చేసుకుంటూ ఉంటుంది. ఇల్లు మారేక, ఓసారి మాత్రం వచ్చి వెళ్లేరాయన. ఓసారి మార్కెట్లో కనబడడమే కాని, మరింక ఆయన్ని చాలా రోజులై చూడ్డంపడలేదు. 'ఓసారి వెళ్లి చూసొద్దామండీ-'' జయ పోరేది. ఎప్పుడూ ఏవో సాకులు చెప్పి, దాటవేస్తున్నాడు పరాంకుశం.

''ఒంటరి పక్షి.. పాపం, ఎలా ఉంటున్నారో ఏమో!''

''ఫరవాలేదులే.. ఈసరికి మరో పరాంకుశాన్ని పట్టే ఉంటాడు..'' తన వాదనని గట్టిపరుచుకోవడం కోసం అలా అనేసేడే కాని - పరాంకుశానికి గుండెలో ఏదో మూల కలుక్కుమంటునే ఉంది.

భర్త యింత స్వార్థపూరితంగా ఎలా ఆలోచించగలుగుతున్నాడో అర్థమయేది కాదు జయకి.

* * *

ఆరోజు పరాంకుశం పెళ్లిరోజు. భార్యాభర్తలిద్దరూ సినిమాకని బయలుదేరారు. స్కూటరు తీయబోతూ ఉంటే, హడావిడిగా వస్తూ కనిపించేరు అచ్యుతంగారు.

''ఈ శనిగ్రహం మళ్లీ దాపురించింది'' అసహనంగా పైకే అనేశాడు పరాంకుశం.

''ఎక్కడికో బయల్దేరినట్టున్నారు. నా రాకవల్ల ఇబ్బందేం లేదు కదా?'' ఒగురుస్తూ అన్నారాయన. పరాంకుశం ముఖం మాడ్చుకున్నాడు.

''అబ్బే, ఇబ్బందేం లేదు. బాబాయిగారూ, రండి'' అంటూ యింటి తాళం తీసింది జయ. ముగ్గురు ఇంట్లోకొచ్చేరు. అచ్యుతంగారు చాలా ఆందోళనగా కనిపిస్తున్నారు. ఈ వయసులో ఏం ఆపద వొచ్చిందో.

లోపల గదిలో కూచుంటూనే గాభరాగా అడిగేరాయన. ''మా వరలక్ష్మి యివాళ మీ బ్యాంకు

కొచ్చింది కదూ''

ఆ ప్రశ్న ఆయన ఎందుకు వేశారో అర్థం కాలేదు పరాంకుశానికి.

వరలక్ష్మి అనే ఆవిడ అచ్యుతంగారికి చాలా దూరపు బంధువు. ఆయనే ఆ సంగతి ఎప్పుడో చెప్పినట్టు గుర్తు. ఇవేళ ఆవిడ బ్యాంకు కొచ్చింది. ఏదో ఆపద పీకలమీద కొచ్చిందని ఏడుస్తూ, బంగారం మీద లోను యిమ్మని తొందరచేస్తే ఓ రెండు వేలిచ్చేడు తను. ఆ సంగతే చెప్పేడు అచ్యుతంగారితో.

''కొంపతీసి మీ బ్యాంకులో అది వడ్డాణం తాకట్టు పెట్టలేదు కదా?'' అచ్యుతంగారి ముఖంలో విపరీతమయిన ఆందోళన..

''అవును వడ్డాణమే!'' కీడేదో శంకిస్తూ చెప్పేడు పరాంకుశం.

అచ్యుతం గారు నిర్ఘాంతపోయేరు. కాస్సేపటికి తేరుకుని ''చంపేశావయ్యా.. అది మంచి బంగారం కాదు. దట్టంగా బంగారం పూతపూయించి చేయించింది. వట్టి కల్తీ నగ.. ఇలాగే ఆ వడ్డాణాన్ని మా పల్లెటూర్లో చాలా మంది దగ్గర కుదవ పెట్టి డబ్బు లాగింది. దాని కది అలవాటే ఈ సారి ఏకంగా నిన్ను బోల్తా కొట్టించి బ్యాంకుకే ఎసరు పెట్టింది..''

పరాంకుశం పై ప్రాణాలు పైనే పోయేయి. జావకారిపోయేడు. చైతన్యం కోల్పోయినట్టు పిచ్చి చూపులు చూడసాగేడు. జయ సంగతి సరేసరి..

''బంగారం మీద లోనిచ్చేటప్పుడు, ఆ నగ మంచిదా కాదా అని నువ్వేకాక ఇంకెవరూ పరీక్ష చెయ్యరూ? మీ బ్యాంకులో లోన్లు మంజూరుకి ముందు షరాఫ్ లేడూ?'' అడిగేరాయన.

''ఊహూఁ... మాది చాలా చిన్న బ్రాంచి.. అన్నీ నేనే చూసుకోవాలి. ఎప్పుడూ బంగారం లోన్ల విషయంలో చాలా జాగ్రత్తగానే ఉంటాను. ఆవిడ విషయంలో తెలిసిన వ్యక్తే కదా అని కొంచెం అశ్రద్ధ జరిగింది... పైగా డబ్బవసరం అని చెప్పి ఏడుస్తూ ఊపిరి తీసుకోడానికీ, ఆలోచించడానికీ వ్యవధి నివ్వలేదు..మోసం చేసింది.''

పరాంకుశానికి భయంతో ముచ్చెమటలు పోశాయి. మర్నాడు మధ్యాహ్నం బ్యాంకుకి తనిఖీ అధికారులొస్తున్న విషయం గుర్తొచ్చిందతనికి. గుండె జారి పోయింది. ఏడుపొక్కటే తరవాయి. జయ పరిస్థితీ దాదాపుగా అలాగే ఉంది.

కాసేపు వాళ్ల మధ్య భయంకరమయిన నిశ్శబ్దం రాజ్యమేలింది.

ఆ తర్వాత ఓ పథకం మనసులో రూపుదిద్దుకున్నట్టుగా చప్పున అన్నారు అచ్యుతంగారు ''నువ్వే మరేం కంగారుపడకు.. నాకో దివ్యమైన ఆలోచన తట్టింది...''

బేలగా, ఆశగా అతని వేపు చూసేడు పరాంకుశం.

''దానికి డబ్బు పిచ్చి జాస్తి. ఈ రాత్రే దాన్ని కలుసుకుని లోను సంగతి నువ్వు నాకు చెప్పావనీ ఆ నగమీద ఇప్పుడిచ్చిన రెండువేలే కాక ఇంకా మరో రెండు వేలులోను యిచ్చే అవకాశం ఉందనీ- కావలిస్తే ఇస్తానని నువ్వు చెప్పినట్టుగా దాంతో చెప్తాను. దాని బుర్రలో ఆ ఆశ పెట్టామంటే మాత్రం

సరిగ్గా మన గాలానికి చిక్కుతుంది. రేపు ఉదయమే ఆ మిగతా రెండు వేల కోసం బ్యాంకుకి వొస్తుంది. నువ్వు నవ్వుతూనే, గుట్టు చప్పుడు కాకుండా బంగారం తాకట్టు విడుదల పత్రాలన్నిటి మీదా జాగ్రత్తగా సంతకాలు చేయించేసుకో. ముందా బంగారం సేఫ్‌లో నుంచి బయటికి లాగెయ్యాలి. అవసరం మనది కనుక ఆ రెండు వేలూ నువ్వే నీ సొమ్ము జమచెయ్యి ముందు ఆ నకిలీ వస్తువు తాకట్టు నుంచి బయటుపడడం ముఖ్యం. డబ్బొస్తోందన్న ఆత్రుతలో అది ముందూ వెనకా చూడకుండా ఎక్కడ కావాలంటే అక్కడ సంతకాలు పెడుతుంది.. బ్యాంకు వ్యవహారాలు దానికంతగా తెలియవు కూడానూ..'' మంచి సలహా యిచ్చేరు అచ్యుతంగారు.

* * *

అచ్యుతంగారిచ్చిన ఆ సలహా వల్ల ఎలాంటి చిక్కులూ లేకుండా ఆ గండం గడిచి బయటపడ్డాడు పరాంకుశం.

తమ కృతజ్ఞతలు చెప్పుకోడానికి స్వీట్లూ అవీ పట్టుకుని అచ్యుతం గారింటికి మర్నాడు వచ్చేరు ఆ దంపతులు.

అచ్యుతంగారు ఆదరంగా మాట్లాడేరు. అతని పట్ల కృతజ్ఞతాభావంతో పరాంకుశం గుండె బరువెక్కిపోయింది.

బయలుదేరే ముందు అన్నాడు. ''ఈ చుట్టుపక్కల ఏదేనా ఇల్లుంటే చూడండి.. మళ్లీ వచ్చేస్తాం..'' అని.

''అదేం.. అక్కడ సదుపాయమైన యిల్లే దొరికింది కదా, ఇక్కడికొస్తే మళ్లీ ఇబ్బందేమో..'' అన్నారాయన.

''అవును.. ఇబ్బందే.. మీలాంటి సహృదయులూ, మంచివారూ పొరుగున లేకపోతే ఇబ్బంది కాదూ!'' మనస్ఫూర్తిగానే అన్నాడు పరాంకుశం.

(ఈనాడు ఆదివారం 8.12.1996)